# ఎమ్మాయుకు వెళ్లు మార్గం

# (లూకా 24:13-36)

నా చిన్నతనంలో ''మార్గపు'' కథలంటే నాకు బహు యిష్టంగా ఉండేయ్. బింగ్ క్రాస్‌బి, బాబ్ హోప్ అనేవారు (1941) ''జింజిబార్ మార్గంలో;'' (1942) ''మొరాకో మార్గంలో;'' (1952) ''బాలి మార్గంలో'' అనే మొదలైన వాటిలో ఉండడం నాకు యిష్టంగా ఉండేది. బైబిల్లో - లూకా 24లో కూడా ''రోడ్డు కథనం'' ఒకటుంది. ముందటి కథల్లా లూకా 24 లోనిది - హాస్యపు కథకాదు. ఆత్మ సంబంధమైనదై భావగర్భితమైయున్న గొప్ప అద్భుత గాథ యిది! (ఇది నిజ జీవిత అనుభవం)!!

ఈ లేఖన భాగంలోనుండి నేను చర్చింపగోరిన వర్తమానం 21వ వచనానికి సంబంధించింది. ''ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించి యుంటిమి'' అని క్లెయొపాయు, అతని స్నేహితుడును చెప్పిన మాటలను చూడబోతున్నాం. ఈ లేఖన భాగంయొక్క వర్తమానం నిరీక్షణకు సంబంధించింది. గనుక అంతరించినట్టు కన్పిస్తున్న నిరీక్షణ, తిరిగి ఉజ్జీవింపజేయబడిన విధానాన్ని మనం ఈ పాఠంలో చూద్దాం.

### నిరీక్షణ కొల్లగొట్టబడింది (లూకా 24:13-14)

పునరుత్థానాన్ని గూర్చి లూకాయొక్క రికార్డును మనం చదివేటప్పుడు వారంలో తొలిదినాన పెందలకడనే కొందరు స్త్రీలు యేసు సమాధిని చూడవచ్చినట్టున్నూ, యిద్దరు దేవదూతలు వారికి ప్రత్యక్షమైనట్టున్నూ చూస్తాం (1-7వచ.). ఆ స్త్రీలు వెళ్ళి, ఆ సంగతులన్నియు ''పదునొకండుగురు శిష్యులకును తక్కిన వారికందరికిని'' తెలియజేశారు (9 వ.). పేతురు సమాధియొద్దకు వెళ్లి, అది ఖాళీగా ఉన్నట్టు కనుగొన్నాడు (12 వ.). 13వ వచనానికి ముందు పునరుత్థాన ప్రత్యక్షతను[1] గూర్చి వ్రాయబడలేదు. ఇదే మొదటిది.

మన చర్చనీయాంశం యిలా ప్రారంభించబడుతుంది: ''ఇదిగో ఆ దినమందే వారిలో ఇద్దరు యెరూషలేమునకు (ఆమడ దూరమున ఉన్న) లేక రమారమి ఏడుమైళ్ల దూరమున ఉన్న ఎమ్మాయు అను ఒక గ్రామమునకు వెళ్లు''తున్నారు. స్త్రీలు ఖాళీ సమాధిని కనుగొన్నది ఆ దినానే. వారిలో ''యిద్దరు'' - అన్నది -

శిష్యులలో తక్కినవారికి సంబంధించినది (9 వ.). వారిలో ఒకని పేరు క్లెయొపా (18వ.)[2]. రెండవ వాని పేరు మనకు చెప్పబడలేదు. ఒకవేళ ఆ రెండవ వ్యక్తి క్లెయొపా భార్యయై[3]యుండవచ్చు. వారు యెరూషలేం నుండి ఎమ్మాయులో[5] ఉన్న, తమ యింటికి[4] వెళ్ళుతున్నట్టున్నారు.

''ఇంటికి వెళ్ళడం'' అనేవి ఏమి ప్రత్యేకమైన మాటలు! నేను నాయింటికి దూరంగా ఉన్నప్పుడు తిరిగి వచ్చేవరకు[6], రోజులను లెక్క పెట్టుకొంటూ ఉంటాను. వీరిద్దరు సంతోషంగా ఉండియుండవచ్చు. వారికి ముందు వసంత కాలపు సౌందర్యముంది. గడ్డి పచ్చని రూపు దాల్చుతుంది, చెట్లు చిగురిస్తున్నాయి, పుష్పములు విప్పారనున్నాయి; పక్షులు కోలాహలం చేస్తున్నాయి. ఈ శిష్యులిద్దరు వీటిలో వేటిని పట్టించుకొన్నట్టులేరు. వారు మెల్లగా నడుస్తున్నారు. వారు సమాధి కార్యక్రమం నుండి యింటికి వెళ్లుతున్నందున కన్నీటి[7] ధారలతో ముఖాలు గీతలు పడినట్టున్నాయి. కోట్లాది కండ్లను చెమ్మగిలజేసి; లక్షలాది కాళ్లను నడిపించిన ఈ మార్గంలో నీవు కూడా నడిచే ఉండవచ్చు. వారు బహుగా ప్రేమించినవాని సమాధి కార్యక్రమాన్ని ముగించుకొని వస్తున్నారు గాని, కేవలం సమాధి కార్యక్రమంనుండి మాత్రమే తిరిగి రావడంలేదు. వారి విశ్వాసం, నిరీక్షణ ఎవరియందు లగ్నమైయుండినదో, ఆయన యొక్క సమాధి కార్యక్రమంనుండి; వాస్తవంగా, వారు యేసు సమాధి కార్యక్రమం నుండి తిరిగి యింటికి వెళ్లుతున్నారు. గనుక విచారంగా, నెమ్మదిగా నడుస్తున్నారు.

వారు ''జరిగిన ఈ సంగతులన్నిటిని గూర్చి యొకరితో నొకరు సంభాషించు చుండిరి'' (14 వ.). ''అన్నియు'' అనే మాటను గుర్తించు. వారు ప్రభువైన యేసుయొక్క మరణాన్ని గూర్చి మాత్రమేగాక, సమాధి యొద్దనుండి ఆ స్త్రీలు తెచ్చిన కలవరపెట్టే వర్తమానాన్ని గూర్చినీ; పేతురు, యోహానులు వెళ్లి ఖాళీ సమాధిని చూచిన సమాచారాన్ని గూర్చినీ వారు మాట్లాడు కొంటున్నట్టున్నారు. 15వచనంలో - వారు ఒకరితో నొకరు సంభాషించు కొంటూ, ఆలోచించుకొంటున్నట్టు వ్రాయబడింది. 17వ వచనంలో - వారు ఒకరితో నొకరు చెప్పుకొంటున్నట్టుంది. బంతిని యిటు అటు ఒకరి కొకరు విసరుకొను తీరులో వారు మాట్లాడు కొంటున్నట్టు - ఆదిభాషలోని భాగం వివరిస్తుంది. వారు మాట్లాడుకొంటూ, సంభాషించుకొంటూ, చర్చించుకొంటూ, ఆలోచించుకొంటూ వస్తున్నట్టున్నారు. అదే సంగతులను పదేపదే అనుకొంటున్నా, ఒక నిర్ణయానికి వారు వచ్చినట్టుగా లేరు.

ఇలాటి మార్గంలో మనలో అనేకులం పయనించియుంటాం. మనం విచారంగాను ఏకాకులమన్నట్టు అనుభూతిని కలిగియుంటాం. ఒకవేళ దేవుడు మరణించాడనే భావం మనకు ఎన్నడూ రాకపోయినా, కనీసం ఆయన బహు దూరుడైయున్నట్టు తలంచియుంటాం. కలవరపెట్టబడి, సందేహ సాగరంలో మునిగిపోయి, నిరీక్షణను కోల్పోయిన హృదయాలతో మిగిలియుంటాం. తార్కికంగా ఆలోచించేకొలది,

ఎక్కువగా తబ్బిబ్బుపడుతూ ఉంటాం. ఎమ్మాయు మార్గంలో నడుస్తున్న శిష్యులవలె, మన కాళ్లు మార్గంలో తడబడినట్లు ఉంటాయి.

## ఆశాజ్యోతి తిరిగి వెలిగించబడింది (లూకా 24:15-17)

''వారు సంభాషించుచు ఆలోచించికొనుచుండగా, యేసు తానే దగ్గరకు వచ్చి వారితోకూడా నడిచెను'' (15 వ.). వారు మెల్లగా నడుస్తూ ఉండగా, వారి వెనుక కాళ్ల చప్పుడు వారికి వినిపించినట్టుంది. వెనుకకు తిరిగి చూచేసరికి, వారెరుగని వ్యక్తి వస్తున్నట్టుంది కాబోలు. మొత్తానికి ఆ వ్యక్తి వీరిలో కలిసి నడువ నారంభించాడు.

''అయితే వారాయనను గుర్తుపట్టలేకుండ వారి కన్నులు మూయబడెను'' అని 16వ వచనంలో వ్రాయబడియుంది. ''ఆయనను ఎరుగకుండునట్లు వారి కన్నులు పట్టుబడ్డాయి''[8] అని అక్షరార్థంగా చెప్పబడింది. వారు ప్రభువును ఎందుకు గుర్తుపట్టలేదో నాకు తెలియదు. ఒకవేళ దైవ జోక్యం వల్లనే అలా జరిగిందేమో. తగిన సమయం వచ్చేవరకు, వారు ఆయనను గుర్తు పట్టలేకుండేలా, దేవుడే అలా కలిగించుకొన్నాడేమో (31వ. చూడు).

వారు ఆయన్ను గుర్తు పట్టలేక పోవడానికి- గతంలో యేసు దేహానికి, పునరుత్థానం తరువాత ఆయన దేహానికి వ్యత్యాసం ఉందేమో. మార్కు 16:12లో ''ఆ తరువాత వారిలో ఇద్దరు ఒక పల్లెటూరికి నడచిపోవుచుండగా, ఆయన మారు రూపముగలవాడై వారికి ప్రత్యక్షమాయెను'' అని వ్రాయబడియుంది. ముందున్న దేహంకన్న ఆయన పునరుత్థాన దేహం కొంత వ్యత్యాసమైనదై యున్నట్టు గ్రహించవచ్చు (1కొరింథీ. 15:44). ఉదాహరణకు- ఆయన పునరుత్థాన దేహంతో తలుపువేయబడిన యింటిలోనికి వెళ్లగలిగారు (యోహాను 20:14; 21:4; మత్తయి 28:17). సమాధి వద్ద మగ్దలేని మరియ; గలిలయ సముద్రం[9] వద్ద శిష్యులు తొలిగా ఆయనను గుర్తించ లేకపోయిన మాట వాస్తవమే. ఈ కారణాన్ని బట్టే ఒకవేళ వారు ఆయనను గుర్తింపక పోయియుండవచ్చు.

ఆ పరిస్థితికి కనీసం కొంతవరకైన వారి హృదయస్థితి కారణమై యుంటుందని నా అనుమానం. వారి కండ్లన్నీ సమాధిమీద, పొర్లింపబడిన గొప్ప రాయి మీద, దానిపై వేయబడిన రోమా ముద్రమీదనే ఉండి ఉంటాయ్. దాన్నిబట్టి వారు పునరుత్థానుడైన తమ ప్రభువును చూడలేకపోయి ఉంటారు. తన మరణం, దాని వెంట కలుగబోయే తన పునరుత్థానాన్ని[10] గూర్చి యేసు తరచుగా తన శిష్యులకు తెలియజేస్తూనే వచ్చారు. ఉదాహరణకు - ప్రభువైన యేసు రూపాంతరపు కొండపైనుండి దిగివస్తున్నప్పుడు, ''- మనుష్యకుమారుడు మృతులలోనుండి లేచువరకు ఈ దర్శనము మీరు ఎవరితోను చెప్పకుడని'' తన శిష్యులకు ఆజ్ఞాపించారు. తరువాత అదే అధ్యాయంలో - ''మనుష్యకుమారుడు మనుష్యులచేతికి అప్పగింపబడబోవుచున్నాడు, వారాయనను

చంపుదురు; మూడవ దినమున ఆయన లేచునని వారితో చెప్పగా వారు బహుగా దుఃఖపడిరి'' అని వ్రాయబడియుంది (మత్తయి 17:9, 22-23). మరో విధంగా చెప్పాలంటే - దైవీకమైన ఏర్పాటునుబట్టి, ఆయన ఎప్పుడు ఎక్కడ ఉంటానని చెప్పారో, ఆయన అక్కడే ఉన్నారు. అయితే, వారి దురభిమానమే - వారి గ్రహింపు కండ్లను మూసియుండవచ్చు (మత్తయి 13:15). మెస్సీయా ఎలా మరణిస్తారు- అనే వారి భావన, ఆయన యేసైయున్నట్టు గుర్తుపట్టలేకుండ - ''అడ్డుకొని ఉంటాయి.''

ఆయన యేసని వారు గుర్తించలేని కారణమేమైయున్నా, వారి కన్నులు తెరచి, వారి గ్రహింపును ఆయన వెలిగింపనైయున్నారు, గనుక ''ఆయన - మీరు నడుచుచు ఒకరితో ఒకరు చెప్పుకొనుచున్న యీ మాటలేమని అడుగగా వారు దుఃఖముఖులై నిలిచిరి'' (17వ.). ప్రభువు మాటలు వారి మార్గానికి అడ్డు తగిలినట్టున్నాయ్. తాత్కాలికంగా వారిని అవి బాధించికూడా ఉండవచ్చు. దుఃఖమనేది వ్యక్తిగత మయ్యింది. మన హృదయం దుఃఖంతో నింపబడినప్పుడు, ఎరుగని వారితో మాట్లాడటం మనకు యిష్టం ఉండదు.

## యేసు లేఖనాలను కంఠోపాఠం చేసినందున ఆయన ఆ ప్రయాణికులను లేఖనాల్లో గుండా నడిపించగలిగారు.

ఏది ఎలాగున్నా, క్లెయొపా అనేవాడు కడకు - ''యెరూషలేములో బసచే యుచుండి, యీ దినములలో అక్కడ జరిగిన సంగతులు నీవొకడవే యెరుగవా? అని ఆయనను అడిగెను'' (18 వ.). ఈ క్రొత్త మనిషి దేశంలోనే బహు వింతైన వ్యక్తి యన్నట్టు మెల్లని గద్దింపే అతని మాటల్లో గోచరిస్తుంది. ''ఇది యొక మూలన జరిగిన కార్యము కాదు'' (అపొ. 26:26). జరిగిన సంగతులను గూర్చి తన ప్రక్కనున్న మనిషి వినలేదంటే క్లెయొపాకు నమ్మకం కలగడంలేదు.

ఏది ఏమైయున్నా, ప్రభువైన యేసు తొందరపడలేదు. అయితే, నెమ్మదిగా, ''ఆయన- అవి ఏవని వారిని అడిగినప్పుడు వారు - నజరేయుడైన యేసును[11] గూర్చిన సంగతులే, ఆయన దేవుని యెదుటను ప్రజలందరి యెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండెను'' (19వ.). ఆ శిష్యులయొక్క విశ్వాసపు పరిమాణమెంతో గమనించు యేసు ఒక ప్రవక్తయని; ఆయన మోషేవంటి ప్రవక్తయని వారు నమ్మారు, (అపొ. 3:22; 7:37లను చూడు). ఆయన మాటలయందును కార్యములయందును ప్రవీణుడైయున్నట్టు వారు నమ్మారు; ఆయన అద్భుత కార్యాలను వారు చూచారు, ఆయన బోధను వారు విన్నారు. అయినా, వారి విశ్వాసం లోప

భూయిష్టమైయుంది. వాస్తవంగా యేసు ఏమైయున్నారో, వారు సంపూర్ణంగా గ్రహించ లేదు; ఆయన సమస్తాన్ని చేయగలరన్న భావన వారికి లేకపోయింది.

''విషయం ఎరుగని వింత మనిషికి,'' క్లెయొపా అనేవాడు యింకా యిలా వివరిస్తున్నాడు: ''మన ప్రధానయాజకులును అధికారులును ఆయనను ఏలాగు మరణ శిక్షకు అప్పగించి, సిలువ వేయించిరో నీకు తెలియదా? ఇశ్రాయేలును విమోచింప బోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి'' (20-21a వ.)[12]. ఒక వారానికి ముందు, యేసు జయోత్సవంతో యెరూషలేములోనికి ప్రవేశించినప్పుడు క్లెయొపాయు అతని భార్యయు రోడ్డు పొడవున బారులు తీరి, ''హోసన్న'' అని కేకలు వేసిన జనసమూహంలో ఉండినవారై యుండవచ్చు. ఆయనయందు బహు గొప్ప విశేషాలను వారు ఎదురుచూచి యున్నట్టున్నారు, కాని అవన్నీ నేలకు విసిరికొట్ట బడినట్టయ్యింది. ''ఇశ్రాయేలు విమోచన'' అనేది భౌతికమైన విమోచనకేగాని, ఆత్మసంబంధమైన విమోచనకు చెందిన మాటల్లా కన్పించడంలేదు. వారి మెస్సీయా ఆడంబరంతోను, బలంతోను వచ్చి, రోమీయుల చేతిలోనుండి ఇశ్రాయేలును విడిపిస్తారనే నిరీక్షణయే వారు సహజంగా కలిగియున్నారు. వారు కన్న కలలకు సిలువ వ్యతిరేకంగా నిలిచింది. ''నిరీక్షించి యుంటిమి'' అనే మాటలు - భూత కాలాన్ని సూచిస్తున్నాయ్. గనుక వారి నిరీక్షణ చచ్చిపోయింది.

ఒకవేళ మన ఆశలు కూడా నిరాశలుగా మార్చబడియుండవచ్చు. అది జరుగుతుంది; లేక యిది జరుగుతుందని - మనం కనిపెట్టి యుండవచ్చు. అయితే అనుకున్నవి జరుగలేదు- దానితో నిరాశ మనలను ఆవరించియుండవచ్చు.

తన మాటలను కొనసాగించక మునుపు, క్లెయొపా తన తలను ఆడించి యుంటాడని నేను ఊహించగలుగుతున్నా. " - ఇదిగాక యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను'' (21b వ.). ''మూడవ దినము'' అన్న మాటలు మనకు ప్రత్యేకమైన అర్థాన్నిస్తాయి. ప్రభువు మృతులలోనుండి లేస్తానని చెప్పిందే - ''మూడవ దినం''[13]. అయితే క్లెయొపా యొక్క భావం అదికాదు. అతడేమంటు న్నాడంటే - యేసు చనిపోయి చాలా కాలమయ్యింది. ఏదైనా జరుగుతుందేమోనని కనిపెట్టాం; అయితే ఏమీ జరుగలేదు. గనుక మేము యింటికి వెళ్లుతున్నాం.

మన గ్రహింపు ఏమైయుండాలో అది అలా లేనప్పుడు, మన భావాలకు మేఘాలు కమ్ముకుంటాయి; మనము నిరీక్షణను కోల్పోతాం.

ఆ ఇద్దరు శిష్యులు నిరాశ, నిస్పృహ, నిర్జీవంలోనికి, దిగిపోవడం మాత్రమేగాక, వారు ఎటూతోచని స్థితిలో నిలిచిపోయారు. వారు నిలిచియున్న పరిస్థితిని గూర్చి క్లెయొపా యిలా వివరిస్తున్నాడు:

> అయితే మాలో కొందరు స్త్రీలు తెల్లవారగానే సమాధియొద్దకు వెళ్లి, ఆయన దేహమును కానక వచ్చి - కొందరు దేవదూతలు తమకు కనబడి ఆయన బ్రతికియున్నాడని

చెప్పిరని మాతో చెప్పి మాకు విస్మయము కలుగజేసిరి (22-23 వచ.).

ఆ స్త్రీలు ''పదునొకండుగురు శిష్యులకును తక్కిన వారికందరికిని'' ఆ సంగతులన్నియు తెలియజేశారు. అయితే వారిమాటలు వీరి దృష్టికి వెర్రి మాటలుగా కన్పించాయి. గనుక వీరు వారి మాటలు నమ్మలేదు. అంటే, ఆ స్త్రీలు కేవలం కాకమ్మ కథలు చెప్పినట్టు వారు భావించారట.

పునరుత్థానమని తమకు తోచిన ఏ అల్ప సమాచారాన్నైనా తీసికొని, ప్రజలను మోసగించ జూచినవారైయున్నట్టు, అవిశ్వాసులైనవారు ప్రభువుయొక్క శిష్యులను అర్థరహితంగా భావిస్తున్నారు. కాని అసలు వాస్తవమేమంటే-ఆయన శిష్యులే పునరుత్థానం కొరకు కనిపెట్టడంలేదు. పునరుత్థానాన్ని గూర్చి వారిని ఒప్పించడానికి బహు బలమైన రుజువులు కావలసి వచ్చాయి (ఈ వాస్తవం అవిశ్వాసులు గుర్తించితే బాగుండు).

క్లెయొపా అనేవాడు తన వివరణను యిలా ముగిస్తున్నాడు: ''మాతో కూడా ఉన్నవారిలో కొందరు సమాధియొద్దకు వెళ్లి ఆ స్త్రీలు చెప్పినట్టు కనుగొనిరి గాని, ఆయనను చూడలేదని ఆయనతో చెప్పిరి'' (24 వ.). ఈ మాటలు పేతురు, యోహానులను చూచిస్తున్నాయి (లూకా 24:12; యోహాను 20:1-10). సంగతి మర్మంగా ఉన్నట్టు క్లెయొపాయు అతని సహచారియు అంగీకరించారు. సమాధి ఖాళీగా ఉంది. యేసు దేహం అందులోనుండి మాయమయ్యింది; అయితే ఏమి సంభవించిందో వారికి తెలియనట్టు ఒప్పుకొన్నారు. అది వారిని ఆశ్చర్యచకితులనుగా[14] చేస్తుందట!

దీని నంతటిని యేసు శాంతంగా విన్నారు. ఇప్పుడు ఆయన మాట్లాడారు. ''అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలనన్నిటిని నమ్మని మందమతులారా'' (25వ.). ''బుద్ధిహీనతను'' వర్ణించడానికి గ్రీకులో నాలుగు పదాలున్నాయి. ఈ స్థలంలో ప్రభువు ఉపయోగించిన మాటలు సాధారణమైనవి, వ్యక్తులను బాధించనివి. New English Bibleల్లో ''మందమతులారా'' అని ఉంది. మరొక దానిలో - ''మతిహీనులారా'' అన్నట్టు ఉంది. ఈ మాటలను ఎవరు ఎలా తర్జుమా చేసిన, అది అభినందన మాత్రం కాదు.

ఈ మాటలను ప్రభువు కఠినంగా పలికారని నేననుకోను. తన స్వరంలో విచారంతో, నెమ్మదిగానే ఆయన ఈ మాటలు అని ఉంటారనుకొంటాను. ఈ శిష్యులు, ఆ మాటకు వస్తే - యేసు శిష్యులంతా, మెస్సీయాను గూర్చిగాని, ఆయన పనిని గూర్చిగాని గ్రహించడానికి కావలసిన ప్రతి అవకాశం యివ్వబడింది. మానవ పాపం కొరకు మెస్సీయా శ్రమ అనుభవించవలసియుందని ప్రవక్తలు తేటైన వర్తమానాన్ని యిచ్చారు. మెస్సీయాను గూర్చిన తొలిప్రవచనం ఆదికాండం 3:15లో

ఉంది. సాతాను యొక్క శక్తిని అణగార్చడానికి మెస్సీయా గాయపరచబడాలని అక్కడుంది. కీర్తనలు 22:16 ప్రకారం ఆయన కాళ్లు, చేతులు - పొడవబడతాయి. ''నా దేవా, నా దేవా, నీవు నన్ను ఏల విడనాడితివి?'' అని, సిలువపై పలికిన మాటలతోనే ఆ అధ్యాయం ప్రారంభమయ్యింది (1 వ.). ''శ్రమపొందు సేవకుడు'' అనే భావంతో యెషయా 53 కేంద్రీకరింపబడింది. ''మన అతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను'' అని అయిదవ వచనం సూచిస్తుంది.

తన శిష్యులయొక్క సమస్య ఏమో ప్రభువు తేటగా చూపిస్తున్నారు. ఆయన యిక్కడ ప్రయోగించిన మాటల్లో అది కన్పిస్తుంది. ''అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలనన్నిటిని నమ్మని మందమతులారా!'' అని ఆయన అనడంలో - ప్రవక్తలు చెప్పిన మాటల్లో, శిష్యులు కొన్నింటిని నమ్మారన్నమాట. మెస్సీయా రాజై, ఏలికయై యుంటారన్న మాటలు వారికి నచ్చాయి, మెస్సీయా యొక్క శ్రమలను గూర్చిన సమాచారం మాత్రం వారికి అంగీకారయోగ్యంగా లేదు. లేఖనాలను[15] ''కత్తిరించి - అతికించడమని బర్టన్ కఫ్‌మన్ సూచించిన పద్ధతిననుసరించి - వారు దోషులై యున్నారు.

ఈ దినాల్లో కూడా అనేకులు దేవుని వాక్యంపట్ల - ''కత్తిరించి - అతికించ బడమనే'' పంథాను అనుసరిస్తున్నారు. దేవుని ప్రేమనుగూర్చి బైబిలు ఏమి చెప్పుతుందో అది వారికి కావాలిగాని, దేవుని ఉగ్రతను గూర్చి బైబిలు ఏమంటుందో అది వారికి అవసరంలేదు. ప్రేమామయుడగు దేవుడనే భావనను యిష్టపడతారుగాని, ఆయనకు భయపడాలనే ఆలోచన వారికి అనుకూలంగా ఉండదు. నిత్య పరలోకమనే బైబిలు సందేశాన్ని ఆహ్వానిస్తారుగాని, నిత్య నరకమనే భావాన్ని విసరికొట్టుతారు. దేవుడు తెలియజేసే దానినంతటిని మనం అంగీకరించనట్లయితే, - ''అవివేకులారా, మందమతులారా'' అని ప్రభువు మనలను గూడా అన్నట్టే ఉంది!

యేసు తన మాటలను యిలా కొనసాగిస్తున్నారు: ''క్రీస్తు (మెస్సీయా[16]) ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా? ''అగత్యం'' అనే పదం గ్రీకులో **"dei"** అని అనబడుతుంది; అంటే ''తప్పని సరిగా అవసరం'' అని అది సూచిస్తుంది. సిలువ యిష్టాను సారంగా కోరుకొన్నది కాదు. దేవుని ఏర్పాటు ప్రకారం సిలువ లేనిదే మానవ విమోచన సాధ్యంకాదు[17]!

మెస్సీయా శ్రమపొందాలి అనే భావనతో శిష్యులు సతమతవౌతున్నారు. ''శ్రమనొందు మెస్సీయా'' వారి దృష్టిలో అసంబద్ధంగా ఉంది. ''శ్రమపొందు సేవకుడు'' అనే అంశం మీద ''రబ్బీలు'' బోధించినప్పుడు ఉదాహరణకు - యెషయా 53లో, శ్రమల భాగాన్నేమో వారు యూదా జనులకు ఉపయోగించారు; మహిమపరచబడే భాగాన్ని మాత్రం మెస్సీయాకు చెందినట్టు సూచించారు.

అందువలనే, ''యూదులకు సిలువ ఆటంకం'' అని పౌలు పలికాడు (1కొరింథీ. 1:23). శ్రమ, మహిమ అనేవి ఒకదానితో నొకటి పెనవేయబడియున్నట్టు యేసు తెలియజేశారు. వాస్తవంగా, మహిమకు రాజబాట శ్రమానుభవమే! మొదట సిలువలేకుండ కిరీటం ఉండనే ఉండదు.

తన శిష్యులు నమ్మేలా, యేసు ఏమిచేయగలరు? ''మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్నుగూర్చిన వచనముల భావము వారికి తెలిపెను'' (27 వ.). యేసుయొక్క శక్తిగల ప్రసన్నత ఉన్నా, లేఖనములనే పునర్విచారణ చేయుడని ఆయన చూపుతున్నారు, మనం కూడా అదే చేయాలి (రోమా 10:17).

తన శిష్యులిద్దరిని బైబిలు స్టడీలో పాత నిబంధన గుండా ఆయన తీసికొని వెళ్లుతున్నప్పుడు, నీవుకూడా అక్కడ ఉంటే బాగుండేది కదూ? పాత నిబంధనలో మూడు వందలకుపైగా మెస్సీయా కొరకు కనిపెట్టే ప్రవచన భాగాలున్నాయి; నీడ - నిజస్వరూపమనే సంగతులు కాకుండానే! మోషే రచనలోని మొదటి పుస్తకంలోని మొదటి ప్రవచనంతోనే యేసు ప్రారంభించియుండవచ్చు: మానవ పతనం జరిగిన తరువాత ''మొదటి సంతాన వాగ్దానాన్ని'' ఎలా చేశారో ఆయన వివరించియుండవచ్చు (ఆది. 3:15). మెస్సీయాకు ముందు ఎవరు వస్తారో సూచించిన మలాకీవరకు ప్రభువు వరుసనే సంగతులు వివరించియుండవచ్చు (మలాకీ 3:1 నుండి). ఆహా! అది ఎలాటి ఉపన్యాసమైయుండి ఉంటుందో!

మనలో మనమాట - యేసు దీన్ని ఎలా చేసియుంటారను కుంటావ్? ''గుర్తులు పెట్టుకున్న నా బైబిలు యిదిగో ముడ్డి జేబులోనుండి దాన్నిలాగి ప్రారంభించ బోతున్నా, మీ బైబిళ్లుకూడా తెచ్చుకొండి; మనం నడుచుకొంటూ వెళ్లేటప్పుడు లేఖనాలను చెప్పుతాను; ఇప్పుడు ఆదికాండం 3:15న్ను చూడు'' అన్నట్టు ఆయన చేశారంటావా? ఆయన అలా చెప్పలేదని నీకు తెలుసు. ఒక సగటు మనిషి వద్ద లేఖనాలు[18] ఉండేయి కావు. ఆ ప్రయాణికులను బైబిల్లో గుండా ప్రభువు నడిపించ గలిగారంటే - లేఖనాలు[19] తన మనస్సులో ఉన్నాయి! ఆయన చదివారు; లేఖనాలను కంఠోపాఠం చేశారు. పైగా ఆ యిద్దరు శిష్యులకు గూడా, ఆ క్రొత్త మనిషి వారితో చెప్పే సంగతులు సత్యమని గ్రహించేలా లేఖనాలతో తగిన పరిచయం కలిగియు న్నట్టున్నారు. ''అది రైటే''నంటూ వారు తమ తలలు ఊపుతున్నట్టు నేను చూడ గలను. ''అవును అది అలాగే ఉంది, ఇంతకముందు మేము దాన్ని అలా భావించలేదు'' అని వారు ఒప్పుకొన్నట్టున్నారు.

పాత నిబంధనలోగుండా యేసు ఆ యిద్దరు ప్రయాణికులను తీసికొని వెళ్లినందున, వారి హృదయాల్లో ఆశాజ్యోతి తిరిగి వెలిగింపబడింది. తరువాత వారేమన్నారో గమనించు: ''ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు బోధపరచు చున్నప్పుడు మన హృదయము మనలో మండుచుండలేదా?

(32వ.). ఆరిపోయినట్లనిపించిన దీపము మరల వెలుగనారంభించింది. జరిగి నదంతా భావపూరితంగా గోచరింప మొదలయ్యింది. సిలువ అపజయానికి రుజువుకాక, విజయ సూచికమైనట్టు లేఖనాలు బోధించాయి. అంతేకాకుండ, మెస్సీయా యొక్క మరణానంతరం, ఆయన పునరుత్థానాన్ని గూర్చి లేఖనాలు బోధించాయ్. నిరీక్షణ తిరిగి వెలిగింపబడింది.

## నిరీక్షణ గుర్తింపబడింది (లూకా 24:28-32)

లేఖనాలను తెరుస్తున్న పని యేసు కొనసాగిస్తూ ఉండగా, ఆ ప్రయాణికులు తాము చేరవలసిన గమ్యానికి చేరుకున్నట్టు తటాలున గుర్తించారు. ''ఇంతలో తాము వెళ్లుచున్న గ్రామము దగ్గరకు వచ్చినప్పుడు ...'' (28వ.) యేసు వారితో ఆట్లాడుటలేదు. తన ప్రవర్తన యితర స్థలాల్లో ఎలా ఏకరీతిగా ఉందో, యిక్కడకూడా అలాగే ఉంది. యేసు ఎవరిమీద భారంగా ఉండినవారు కారు. ఆ ప్రయాణికులిద్దరు ఆయనను బలవంత పెట్టకుంటే ఆయన అక్కడ ఆగియుండేవారు కారు. ఈ సంఘటనలో యిది కీలక భాగం! ఒకవేళ ఆయన అక్కడ ఆగక, సాగిపోయి ఉన్నట్టయితే, వారు పునరుత్థానుడైన ప్రభువుతో[20] ఉన్నట్టు వారికి తెలిసేది కాదు! (అలాగే దేవునికి నీ విషయంలో తన ఏర్పాటుంది. అయినా ఆ సంకల్పాన్ని ఆయన నీపై రుద్దరు. తన సంకల్పానికి అనుగుణ్యంగా నీయంతట నీవే నీ జీవితాన్ని మల్చుకోవాలి. నీవు ఒకవేళ అలా చేసికోనట్టయితే, నీకొరకు ఆయన దేన్ని సిద్ధపరచియుంచారో - నీకెన్నడూ తెలియకయే దాటిపోతుంది).

''వారు - సాయంకాలము కావచ్చినది, ప్రొద్దుక్రుంకినది, మాతోకూడా ఉండుమని చెప్పి, ఆయనను బలవంతము చేసిరి'' (29వ.). ''వారు గట్టిగా కోరిరి'' అని NIV అంటుంది. ఎవరైనా మనతో ఉండాలని మనం కోరుకొంటే, వారిని ఎలా నిలుపుకోవాలో మనకు తెలుసు, కదా? అలా కాకుండ, మన మర్యాదను, మన భోజనాన్ని మనం దక్కించుకో దలచుకొన్నప్పుడు, దానిని కూడా ఎలా చేయాలో మనకు తెలుసు. ''ఇలా వచ్చేటప్పుడు మమ్మును ఒకసారి దర్శించిపోండి లేదా, తొందరలో మనం కలిసి భోజనం చేయాలి'' అని అంటే వచ్చినవారెవరూ మనతో ఉండరు. ఈ శిష్యులిద్దరు మాత్రం ఆయన తమతో ఉండాలనికోరి, గట్టిగా బలవంతం చేశారు. ప్రొద్దుపోయింది. రోడ్డు కన్పించడం కష్టతరంగా మారిపోయింది. పైగా, దొంగల, లేక అడవి మృగాల అపాయం ఉంది. గనుక ఈ రాత్రి మాతో గడుపుమని అడిగారు - అట!

యేసు వారి కోర్కెను మన్నించారు. ''గనుక ఆయన వారితోకూడ ఉండుటకు లోపలికి'' వెళ్లారు (29b వ.). తన్ను ఆహ్వానించినవారి జీవితాల్లోనికి యేసు ప్రవేశించారు (ప్రకటన 3:20)[21].

''ఆయన వారితోకూడా భోజనమునకు కూర్చుండినప్పుడు, ఒక రొట్టెను పట్టుకొని స్తోత్రముచేసి దాని విరిచి వారికి పంచిపెట్టగా'' (30వ.). సాధారణంగా సత్కరించేవారు, ఆహారం కొరకు స్తోత్రంచేసి వడ్డించుతారు. అయితే, ఆ క్రొత్త వ్యక్తి మీద ఎంతగా గౌరవం పెంచుకున్నారంటే, ఆ పనిని వారు తనచేతనే చేయించగోరునంతగా వారాయన్ను గౌరవించారు. ఇక్కడ ప్రభువైన యేసు చేసింది, గతంలో ఆయన తరచుగా చేసిన పనియే. ఆయన ఐదువేల మందికి ఆహారం పెట్టినప్పుడు ఉపయోగించిన మాటలవేనట! (లూకా 9:16 ను పోల్చిచూడు) ప్రభురాత్రి భోజనాన్ని ఏర్పాటు చేసినప్పుడు కూడా (అదే మాటలు).

యేసు స్తోత్రం చేసిన పిమ్మట, ఆయన ఎవరో వారు తటాలున గుర్తించారు. ''వారి కన్నులు తెరువబడి[22] ఆయనను గుర్తుపట్టిరి'' (31a వ.). మొదట వారాయనను ఎందుకు గుర్తుపట్టలేకపోయారో మనకు నిశ్చయంగా తెలియనట్టే, వారు తటాలున యిప్పుడు ఎలా గుర్తుపట్టగలిగారో కూడా నిశ్చయంగా తెలియదు. ''రొట్టె విరుచుటవలన ఆయన వారికి తెలియబడినట్టు'' 35వ వచనం అంటుంది. ఒకవేళ స్తోత్రం చేయడంలోను, రొట్టెను యివ్వడంలోను ఆయనకని ఒక ప్రత్యేకమైన ఒక విధానం ఉందేమో. ''మా తండ్రీ'' (మత్తయి 6:9) అనడానికి బదులు ''నా తండ్రీ'' (యోహాను 10:29) అనే ప్రత్యేకమైన విధానంగా ఆయన ప్రార్థించారేమో. ప్రభువు రొట్టెను తన చేతులతో పట్టుకొన్నప్పుడు, ఒకవేళ ఆయన చేతులకున్న గాయాలు వారికి కన్పించాయేమో. తన చేతికి రొట్టెను తీసికొన్న తరువాత, ఒకవేళ దైవీక నిర్బంధం తొలగింపబడిందేమో (16 వ.). తటాలున యేసు[23] అని వారాయనను గుర్తించడానికి నిజంగా ఏమి జరిగిందో నాకు తెలియదు. కాని వారి సందేహం అంతరించింది! యేసు మృతులలోనుండి లేపబడ్డారు!

ఆ తరువాత వాక్యం అతి నిరుత్సాహకరమైనట్టుగా వినిపిస్తుంది. ఆయన యేసు అని వారు గుర్తుపట్టినప్పుడు యింకా ఎక్కువగా వారికి బోధించడానికో, లేదా వారిని ప్రోత్సాహించడానికో అది తగిన సమయం అన్నట్టు అది గోచరిస్తుంది. అయితే, అలా జరిగించడానికి బదులు ''అంతట ఆయన వారికి అదృశ్యుడాయెను'' అని వ్రాయబడింది (31b వ.). అంటే, ఆయన లేచి నిలిచి ద్వారంగుండా నడిచివెళ్లి పోయారని దాని భావం కాదు. కాని ఒక క్షణంలో అక్కడ ఉండి, మరుక్షణంలో అక్కడ లేనట్టు అనేదే ''అదృశ్యుడాయెను'' అనే మాటకు భావం.

దీనితోనే యేసు ఆ యిద్దరు శిష్యులను విడిచిపెట్టలేదు. క్లెయొపాయు అతని జతగాడును అపొస్తలులతో కూడియున్నప్పుడు, ఆ రాత్రిలోనే యేసు తిరిగి వారికి ప్రత్యక్షమైనట్టు 36వ వచనం సూచిస్తుంది. అంటే, యేసు తన శిష్యులకందరికి ఆ వర్తమానం పంపుతున్నారన్న మాట, తన మరణానికి ముందు ఆయన శరీరాన్ని బట్టి

పరిమితి చేయబడియున్నారు. మానవ కాళ్లతో నడిచేవారు; మానవ చేతులతో పనిచేసేవారు, మానవ కండ్లతో ఆయన చూచేవారు. నేడు ఆయన తన పునరుత్థానపు దేహంలో ఉన్నారు. దానితో తలుపులు మూసిఉన్నా, గదిలోనికి ప్రవేశించ గలుగుతున్నారు; కావాలనుకున్నప్పుడు ప్రత్యక్షమౌతున్నారు; లేకుంటే అదృశ్యమౌ తున్నారు. నేను ''అపరిమితుడను'' నేను ఎక్కడైనా ఉండగలను, ప్రతిచోట ఉండగలను,''నేను పరలోకానికి ఎక్కిపోయినా (ఆరోహణమైనా), మిమ్ములను బలపరచడానికి, లేదా సహాయం చేయడానికి మీతోకూడా ఉండగలను'' అనేదే దీని వర్తమానంగా గోచరిస్తుంది.

ఆ శిష్యులకు యిప్పుడు సమస్తం తేటగా ఉంది. గనుక, ''వారు - ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు బోధపరచుచున్నప్పుడు మన హృదయము మనలో మండుచుండలేదా? అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి'' (32 వ.). ''బోధపరచుట'' అనే పదం ''తెరుచుట'' అని 31వ[24] వచనంలోని పదమూలం నుండే తర్జుమా చేయబడింది. లేఖనాలు తెరువబడడంతో, వారి కన్నులు కూడా తెరువబడ్డాయి.

## నిరీక్షణ అభ్యసించబడింది (లూకా 24:33-36)

ఎమ్మాయు మార్గంలోని ఆ యిద్దరు శిష్యుల హృదయాల్లో మండింపబడిన ఆశాజ్యోతిని తమకొరకే ఉంచుకొనడం వారివలన కాకపోయింది. అది యితరులతో పంచుకోవాలి; - రేపుకాదు, ఆ రాత్రికే అది జరగాలి! (క్రైస్తవ వర్తమానమనేది నీవు యితరులకు పంచేవరకు అది నీదికాదని - ఒకరన్నారు). ''ఆ గడియలోనే (వెంటనే) వారు లేచి, యెరూషలేమునకు తిరిగి'' వెళ్ళారు (33a వ.). రాత్రి ప్రయాణం చేయవద్దని వారు యేసుకు చెప్పిన సంగతులనన్నింటిని వారు మరచినట్టున్నారు, ఆ చీకటిలోనే వారు తొందరగా వెళ్లనారంభించారు. సుమారు వారు ఏడు మైళ్ళకు పైబడిన దూరం కాలినడకన అంతకు ముందే వచ్చారు; అంత దూరాన్ని తిరుగ నడువ మొదలుపెట్టారు (దానికి వారు వెనుకాడకున్నారు).

క్లెయొపాయు, అతని సహచారియు - ''పదునొకండుగురు[25] శిష్యులును వారితో కూడ కూడియున్నవారిని'' కనుగొన్నారు (33b వ.). అది రాత్రివేళ పది, పదకొండు, లేక పన్నెండు గంటలే అయ్యుండవచ్చు. యెరూషలేములోని శిష్యులు కాలాన్ని అంతగా పట్టించుకోనట్టున్నారు. వింత సంభవాల విషయం ఆలోచింప కూడివచ్చినట్టున్నారు. ఆ గుంపు ఏ సంగతులను చర్చించుకొంటున్నారు. 34వ వచనం సూచిస్తుంది: ''- ప్రభువు నిజముగా లేచి సీమోనునకు కనబడెనని చెప్పుకొనుచుండిరి''. ప్రభువు

పేతురుకు[26] కనబడిన సంగతి మారుమ్రోగుతుంది. అయినా అప్పటివరకు శిష్యులందరు యింకా నమ్మికయుంచియుండలేదని మార్కు చెప్పియున్నాడు (మార్కు 16:11, 14).

ఈ గుంపుతో చేరిన ఆ యిద్దరు ప్రయాణికులు తమకు జరిగిన సంగతులను చెప్పబూనారు. ''త్రోవలో జరిగిన సంగతులును, ఆయన రొట్టె విరుచుటవలన తమకేలాగు తెలియబడెనో అదియు తెలియజేసిరి'' (35 వ.). ఆ సంగతులు వినడానికి జనులు బహుగా శ్రద్ధ చూపియుంటారని నేను తలస్తున్నాను. అయినా కొందరు యింకా సతమతమౌతూనే ఉన్నారు. వారు (క్లెయొపాయు, అతని సహచారియు) వెళ్లి తక్కినవారికి ఆ సంగతి తెలియజేసిరి గాని, వారు వీరి మాటల నైనను నమ్మకపోయిరి'' అని మార్కు 16:13 అంటుంది. అయితే ఒకటి మాత్రం వాస్తవం, ఏమంటే - క్లెయొపాగాని, అతని సహచారిగాని కొట్టబడడం లేదు; ఆయన లేచినట్టు[27] వారికి నిర్ధారణ చేయబడింది.

వారు మాటలాడుతూ ఉండగా, తటాలున ప్రభువు అక్కడికి వచ్చియున్నారు! ''వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను'' నిలిచారు (35 వ.). సంఘటనను కొనసాగించడానికి సమయం చాలదు. తమ నిరీక్షణను కోల్పోయి, ప్రయాణం చేసిన యిద్దరు వ్యక్తులయొక్క ఆశాజ్యోతి తిరిగి ఎలా వెలిగించబడి సజీవంగా నిలిచిందో - వారి యొద్దనే మన పాఠాన్ని నిలిపివేద్దాం.

## ముగింపు

నీ నిరీక్షణయొక్క స్థితి ఎలాగుందో నాకు తెలియదు. అంటే, అది తేజోవంతంగా వెలుగుతుందో, గుడ్డి దీపంగా కొట్టబడుతుందో, లేక అది ఆరిపోబోతుందో! ఎమ్మాయు శిష్యులవలె, నీ నిరీక్షణ చచ్చినదానితో సమానమైయుంటే - యేసు యొక్క పునరుత్థాన సత్యమనే బండమీద అది ఆనుకొనేలా, తిరిగి ఉజ్జీవింపబడజేయవచ్చు. పేతురు యిలా వ్రాశాడు: ''మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన జీవితంతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు ... ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను జన్మింపజేసెను'' (ఇంగ్లీషులో యిది 1పేతురు 1:3 ).

పునరుత్థానాన్ని నమ్మడానికి - ఖాళీ సమాధిని గూర్చిన సత్యం; అవిశ్వాసులై యుండిన శిష్యుల హృదయాల్లోను, జీవితాల్లోను కలిగిన వింతైన మార్పు; నేరము మోపబడని సాక్షుల[28] సమాచారం, మొదలైన రుజువులు ఆధారంగా ఉన్నాయి. 34వ వచనంలో - ''ప్రభువు నిజముగా లేచియున్నాడ''నే విజయ సందేశాన్ని ప్రతిధ్వనించ డానికి మనకు అనేక కారణాలున్నాయి.

ఏది ఎలాగున్నా, ఆహారముందని తెలిసికొన్నంత మాత్రాన ఆకలి

తీర్చబడదన్నట్టు, నీళ్లు ఉన్నాయని ఎరిగినంతనే దప్పికకూడా తీర్చబడదు. అలాగుననే, కేవలం పునరుత్థానాన్ని గూర్చిన సత్యం ఎరిగినంత మాత్రానే, హృదయం నిరీక్షణతో నింపబడదు. నీవు సంపూర్ణంగా నమ్మి, ఆ విశ్వాసాన్ని బాప్తిస్మమందు నీటి సమాధిలో నుండి లేవడం ద్వారా దాన్ని కనుపరచాలి. నూతన జీవంపొంది అనుదినం ఆయనతో కూడా నడుస్తూ ఉండాలి! (రోమా 6:3-6).

క్లెయొపాయు, అతని సహచారియు యేసుతో కూడ వారి యింట కూర్చుండి యున్నప్పుడు, ఒక సామాన్య గృహంలో, సాధారణమైన రొట్టెదో, సామాన్య భోజనంలాగానే ఉంది. అటుపిమ్మట అసాధారణమైన కార్యం సంభవించింది. ఇది నీకొక సాధారణ దినంగా తోచవచ్చు, కాని నీ యిష్టాన్ని ప్రభువుయొక్క చిత్తానికి[29] లోబరచినట్లయితే, ఇదే నీకొక అసాధారణమైన దినంగా మార్చబడవచ్చు.

---

సూచనలు

[1]ఇతర సువార్త రచనల్లో - ప్రభువైన యేసు ఎమ్మాయు అను గ్రామానికి పయనిస్తున్న యిద్దరు ప్రయాణికులకు ప్రత్యక్షం కాకముందు - ఆయన మగ్దలేనే మరియకును, తక్కిన స్త్రీలకును కనబడినట్టు వ్రాయబడింది. నాలుగు సువార్త రచనలు ఒకదాని నొకటి బలపరచుకొంటున్నాయి. ప్రభువైన యేసుయొక్క పునరుత్థానం, ప్రత్యక్షతలు - అనే వాటిని సంపూర్ణంగా తెలిసికోవాలంటే - నాల్గు సువార్త సందేశాలను కలిపి చూడవలసియుంటుంది.

[2] క్లెయొపా అనే వ్యక్తిని గూర్చి యింతకంటే ఎక్కువగా మనకు తెలియదు, క్లెయొపా అనేవాడు - యోసేపు యొక్క సహోదరుడు; అంటే యేసుకు చట్టసంబంధమైన పినతండ్రి యని ఒక పారంపర్యమంటుంది గాని, దానికి ఎలాటి రుజువులూ లేవు.

[3] పేరు చెప్పబడని రెండవ వ్యక్తి లూకా అని మరో పారంపర్యం అంటుంది గాని, (20 వ.)లో ''మన అధికారులు'' అనే మాటలు - ఆ ప్రయాణికులిద్దరు యూదులైయున్నట్టు సూచిస్తున్నాయి, (లూకా గ్రీకు దేశస్థుడై యుండవచ్చు). పేరు చెప్పబడని ఆ జతగాడు - పేతురని కొందరన్నారుగాని, 34వ వచనం అలాటి అవకాశాన్ని తొలిగిస్తుంది. పేరు చెప్పబడని జతగాడు, సాధారణంగా పురుషుడైయున్నట్టు సూచించబడింది. NASB లో ''అవివేకులైన మనుష్యులారా'' అని 25 వ వచనంలో ఉంది. అయితే పురుషులనే భావన తర్జుమాదార్లవల్ల - ఇయ్యబడింది. ఆ పదాల ప్రయోగాన్ని - మతిహీనులారా లేక ''అవివేకులారా'' అని తర్జుమాచేయవచ్చు. 29వ వచనంలో, వారిద్దరు ఒకే యింట నివసించినట్టు సూచించిన కారణాన్ని బట్టి - వారిద్దరు క్లెయొపాయు, అతని భార్యయు అయ్యుండవచ్చునని తార్కికంగా ఊహించవచ్చు.

[4]28-29వ వచనాల్లో వారి యిల్లు ఎమ్మాయు అనే గ్రామంలో ఉన్నట్టు తెలియబడుతుంది.

[5]ఎమ్మాయు ఎక్కడున్నది నేడు మనకు తెలియదు. యెరూషలేమునకు పడమరనగాని, ఉత్తరాన గాని, ఉండియున్నట్టు అనేకమంది పండితులు భావిస్తున్నారు. యాత్రికుల కొరకు ఎమ్మాయు అనే ఒక స్థలాన్ని చూపుతున్నారు గాని, అది యెరూషలేమునకు 19 మైళ్ళ దూరంలో ఉంది - ఏడు మైళ్ళు కాదు.

[6]క్రొత్త స్థలాలు చూడడం నాకు యిష్టమేగాని, నా యింటనుండి దూరంగా ఉండడం నాకు అంత సౌభాగ్యంగా ఉండదు, నేను నా రోజులు లెక్కించుకొనడం మాత్రమేగాక, నా పనులను సహితం నేను లెక్కించుకొంటూ ఉంటాను. నేను యింటి ముఖం పెట్టిన తరువాత ఆగే స్థలాలను కూడా లెక్కించుకొంటూ ఉంటాను.

[7]17వ వచనంలో - దుఃఖంగా కన్పించారని ఉంది; NIV లో - ''వారు దుఃఖ ముఖులైయుండిరి; లేక దుఃఖంతో వారు తమ ముఖాలను దించుకున్నారు'' అని ఉంది.

[8]KJV లో ఆది భాషాప్రయోగాలను సూచిస్తుంది; తక్కిన తర్జుమాలలో: ''వారు ఆయనను గుర్తుపట్టలేకుండ

ఉంచబడ్డారు (NIV); వారికండ్లు ఆయనను గుర్తు తెలియనీయకుండ చేశాయి? (RSV) అని వ్రాయబడినట్లుంది.

[9]ఈ సంఘటన కొనసాగుతూ ఉండగా, యేసు తన శిష్యుల కందరికి ప్రత్యక్షమైనప్పుడు, మొదట వారు ఆయనను భూతమని అనుకున్నారు (లూకా 24:36).

[10]మత్తయి 12:38-40; యోహాను 2:19-21; etc.

[11]యేసు అనే పేరు ఆ దినాల్లో యితరులకు కూడా ఉంది. యెహోషువా అనే హెబ్రీ రూపానికి ''యేసు'' అనేది గ్రీకుపదం. ఎరుగని ఆ బాటసారికి, క్లెయొపా పరిచయం చేసింది - ''నజరేయుడగు యేసునే'' (KJV, NIV, RSV).

[12]పిలాతును గాని తక్కిన రోమా అధికారులనుగాని -''మన అధికారులని'' - యూదులు సూచిస్తారంటే సందేహిస్తాను. క్లెయొపా, సిలువను గూర్చి మాట్లాడినప్పుడు- రోమీయులనుగాని, సిలువలో వారి రోమీయులు భాగాన్ని గాని ఉద్దేశించినట్టులేడు. అలాటి ఒక ప్రస్తావన నేటి దినాల్లో "Antisemitic'' అని సూచింపబడుతుంది గాని, వాస్తవానికి అది ఒక యూదునిచే చేయబడిందే. అమర్యాదగా చూడబడడాన్నిగాని, ద్వేషబుద్ధితో చూడబడడాన్నిగాని ఎన్నడు సమర్థింపకూడదు. అయితే, యేసును సిలువవేయించిన నేరమంతా నేరుగా, యూదుల మీదను, వారి నాయకుల భుజాలమీదను మోపబడింది (అపొ.2:23).

[13]మత్తయి 16:21; 17:23; etc

[14]వీరిద్దరి మాటలు - ప్రభువు యొక్క యితర శిష్యుల హృదయాల్లోను, తన పదునొకండుగురి హృదయాల్లోను ఉన్న భావ పోరాటాన్ని సూచిస్తున్నాయి.

[15] James Burton Coffman; *Commentary on Luke* (Abilene, Tex., A.C.U. Press, 1975), 467.

[16]''క్రీస్తు'' అనే గ్రీకు మాటకుగాని; మెస్సీయా అనే హెబ్రీ పదానికిగాని, ''అభిషిక్తుడు'' లేక ''అభిషేకింపబడినవాడు'' అని అర్థం.

[17]"Do Lord'' - అనే యవ్వనుల పాటలు - ''నీవు సిలువ మోయనట్లయితే, నీవు కిరీటం ధరించలేవు'' అనే మాటలున్నాయి. "Health-and-wealth Gospel'' ''ఆరోగ్యం ఐశ్వర్యం'' అనే సువార్తను ప్రకటించేవారు, ''నమ్మకమైన దేవుని బిడ్డకు ఎలాటి సమస్య ఉండదు'' అని అంటారు. కాని పౌలైతే ''... అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెనని'' చెప్పుతున్నాడు (అపొ. 14:22).

[18](అపొ. 8)లోని నపుంసకుని వద్ద యెషయా గ్రంథపు చుట్ట ఉండడం బహు అసాధారణమైన విషయం. అది అతనికి చాలా ఖరీదయ్యుండాలి.

[19]లూకా 2:52ను - యింకా యితర లేఖనాలను బట్టి - లేఖనాల జ్ఞానాన్ని మనం చదివి ఎలా పొందుతున్నామో, అలాగే ప్రభువైన యేసు కూడా పొందియుంటారనేది నా నమ్మకం.

[20]తమతో ఉండుమని వారు ఆయనను బలవంతపెట్టక యున్నట్లయితే- మనము క్లెయొపాను గూర్చి వినియుండే వారమేకాదు!

[21]తన చిత్తానికి తమ్మును తాము అప్పగించుకున్నవారి జీవితాలలోనికి ప్రభువు వస్తారు (మత్తయి 7:21-23).

[22]ఈ ప్రత్యేక పదప్రయోగం- లేఖనాల్లో తరచుగా చేయబడుతుంది (2రాజు. 6:17). మనలో కూడా అనేకులు కండ్లు తెరువబడవలసిన అవసరం ఉంది!

[23]The Cotton Patch Versionలో ''వారికి జ్ఞానోదయం కలిగింది'' అని వ్రాయబడియుంది.

[24]KJVలో ''ఆయన మాకు లేఖనములను తెరచెను'' అని ఉంది.

[25]''పదనొకండగురు'' అనే పదం- యూదాకు బదులుగా మరొకరు వారితో చేర్చబడే వరకు - క్రీస్తు యొక్క అపొస్తలులను సూచిస్తుంది. ఆ ఖాళీ పూరించిన తరువాత వారు తిరిగి ''పన్నెండుగురు'' గా గుర్తింపబడ్డారు.

[26]ప్రభువు యొక్క ప్రత్యక్షతలను గూర్చి 1 కొరింథీ. 15:5 పౌలు వివరిస్తున్నాడు. తనకు వలదని నెట్టివేసిన పౌలుకుకూడా యేసు ప్రత్యక్షమయ్యారు.

[27] 35వ వచనంలో ''గుర్తించారు'' అని తర్జుమా చేయబడిన మాట - ఎరిగియున్నారనే మాటనుండి వచ్చింది (KJV చూడు).

[28] ఎమ్మాయి మార్గంలోని శిష్యులను కలిసికొన్నట్టు ప్రభువు నేడు మనలను వ్యక్తిగతంగా కలిసికోబోయేది లేదుగాని, అక్కడ సంభవించిన దానికి సంబంధించిన - దైవప్రేరేపితపు రికార్డు, అదే పనిని జరిగిస్తుంది (యోహాను 20:30-31).

[29] ప్రసంగ సూచన - ''మామూలు బిల్డింగులో, ఒక సాధారణమైన సువార్తికుని యెదుట ఒక సామాన్యమైన ఆదివారపు కూడికలా ఉండవచ్చుగాని, నీ యిష్టాన్ని ప్రభువు చిత్తానికి లోబరచినట్లయితే, ఇదే అసాధారణమైన దినంగా మారవచ్చు!'' నని చెప్పవచ్చు.

## మార్తా లేక మరియా: పనా లేక ఆరాధనా?

పని (మార్త) ఆరాధన (మరియ) - అనే వాటిమధ్య నీవు ఒక్క దానినే కోరుకోనవసరంలేదు. ఎందుకంటే - ప్రతిదానికీ సమయం, స్థలం ఉంది, చార్లెస్ వెస్లీ వ్రాసిన పాటలో ఈ మాటలు చేర్చబడ్డాయి.

> నా ప్రభువుయొక్క ఆజ్ఞకు నమ్మకత్వం
> శ్రేష్ఠమైన భాగాన్నే నేను యింకా కోరుకుంటాను
> శ్రద్ధగల మార్త చేతులతో ఆయన్ను సేవిస్తాను
> మరియ ప్రేమించే హృదయంతో ఆయన్ను ప్రేమిస్తాను.

ప్రభువైన యేసు మాటలను వినవలసిన సమయంలో మార్త వంట చేస్తుంది. అనేక సంవత్సరాల క్రిందట, క్లెయన్ లిల్స్ ఒక స్థానిక సంఘంలో బోధిస్తున్నప్పుడు తూర్పు ఓక్లహోమాలో యిలాంటి సంఘటనే జరిగింది. ఉదయపు ఆరాధనలో లిల్స్ బోధించేటప్పుడు, ప్రతి ఒక్కరు క్లిక్, క్లిక్, క్లిక్ అనే శబ్దం విన్నారు. మెరుస్తున్న ఎరుపురంగులో బట్టలు వేసికొని, ఎరుపు ఎత్తు చెప్పులతో పెంకులు కప్పబడ్డ నేలపై యిరువైపుల వేయబడిన కుర్చీలకు మధ్యకు ఒక స్త్రీ వచ్చింది. స్థానిక సంఘ సువార్తికుని వెనుక ఆమె కూర్చుండి, అతని శ్రద్ధను పొందడానికి ప్రయత్నించింది.

మూడుసార్లు గట్టిగా చప్పరించింది. అయినా అతడు ఆమెను లక్ష్యపెట్టలేదు. కడకు తాను లేచినిలిచి, ఆపుమని క్లెయన్‌కు చేతితో సంజ్ఞచేసి, ఆమె శ్రోతలవైపు తిరిగి, ''సోదరులు లిల్స్‌గార్కి నేను భోజనం సిద్ధం చేస్తున్నాను, ఇక్కడున్న సువార్తికులనందరిని భోజనానికి ఆహ్వానిస్తున్నాను''. అప్పుడు ఆ బిల్డింగులోనుండి ఆమె క్లిక్, క్లిక్, క్లిక్ అనే శబ్దంతో మిగిలినవాటిని సిద్ధం చేయడానికి వెళ్ళింది. ఏం మాట్లాడకుండ క్లెయన్‌గారు, ప్రసంగాన్ని ఎక్కడ నిలిపారో, అక్కడనుండి కొనసాగించారు. తన యొద్దనుండి తీసివేయబడని ఆ మంచి భాగాన్ని ఆ సోదరి పోగొట్టుకొంది.